విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జిల్లా కేంద్రంలో గల డీఎన్టీ డిఎన్టి, బిసి గర్ల్స్ హాస్టల్లో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఎగురవేశారు. అనంతరం జిల్లా సహాయ కార్యదర్శి ఒమ్మి సతీష్ మాట్లాడుతూ పురిటి పొత్తిళ్లలో నుంచే ఉద్యమాలు చేపట్టిన ఘనత ఒక ఏఐఎస్ఎఫ్‌దేనని అన్నారు. ఉద్యమాలలో ఉద్భవించి, పోరాటాలలో రాటుదేలి సామ్యవాద సమాజ స్థాపన కోసం అవిరళ త్యాగాలతో ఉద్యమాన్ని నిర్మిస్తున్న ఏకైక విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఏఐ ఎస్ఎఫ్) అని అన్నారు. స్వాతంత్రం మా జన్మహక్కని భారతజాతి ఎలుగెత్తి నినదిస్తున్న తరుణంలో పొత్తిళ్లలోనే పిడికిలి బిగించి 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో నగరంలో బెనారస్ విశ్వవిద్యాలయంలో ఆవిర్భవించిందన్నారు. బ్రిటిష్ సామ్రాజ్య వాదుల పాలనకు సమాధి కట్టడంలో అగ్రభాగాన నిలిచిందన్నారు. నాటి నుండి నేటి వరకు దేశాన్ని ప్రగతి పథం వైపు నడిపించడానికి పోరాటాల మార్గాన్ని ఎంచుకుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వియ్యపు రాజు, నాయకులు శ్యామ్, శివ, రమ్య, శ్రావణి, లావణ్య, పావని తదితరులు పాల్గొన్నారు.

గాజువాక సిటీ: విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) పోరాడుతుందని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కెంగువ అచ్యుత రావు అన్నారు. ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం గాజువాక బీసీ హాస్టల్ ప్రాంగణంలో జరిగింది. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఏఐ ఎస్ఎఫ్ రాజీలేని పోరుసాగిస్తుందని అన్నారు. ఈ కార్యక్ర మంలో

మండల కార్యదర్శి శేఖర్, నాగేంద్ర, అఖిల్, భవాని పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కె.రాజశేఖర్ పాల్గొని జెండా ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యమాలతో ఉద్భవించి, పోరాటాలలో రాటుదేలి సామ్యవాద సమాజ స్థాపన కోసం అవిరళ త్యాగాలతో ఉద్యమాన్ని నిర్మిస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. నాటినుండి నేటి వరకు దేశాన్ని ప్రగతి పథం వైపు నడిపించడానికి పోరాటాల మార్గాన్ని ఎంచుకుందన్నారు. మార్క్సిజం లెనినిజం తన ఊపిరిగా, శాస్త్రీయ సోషలిజం తన గమ్యంగా, సెక్యులరిజాన్ని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడం తన కర్తవ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సాయి, మల్లేశ్, శివాజీ, సూర్య, జోసెఫ్ పాల్గొన్నారు.

పెదముషిడివాడలో ఆగని గ్రావెల్ తవ్వకాలు

విశాలాంధ్ర - పరవాడ: అనకాపల్లి జిల్లా పరవాడ మండలం పెదముషిడివాడలో మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలు ఆగడం లేదు. రాత్రివేళల్లో ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి, గ్రావెల్ తవ్వకాలు నిత్యం జరుగుతున్నాయి. అధికార పార్టీ నేతల అండతో స్థానిక గ్రావెల్ మాఫియానే ఇటువంటి దురాగతాలకు పాల్పడుతోంది. ఇందులో భాగంగా సర్వే నెంబర్ 365లో వారం రోజులుగా పెద్ద మొత్తంలో గ్రావెల్ తరలిపోయింది. అక్రమార్గంలో విలువైన గ్రావెల్ తరలిపోతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టనట్లు వ్యవహరించడం పట్ల అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత నాలుగేళ్లుగా 409, 407, 367 సర్వేనెంబర్ల ప్రాంతాల్లో జోరుగా అక్రమ మైనింగ్ జరుగుతూనే ఉన్నా ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకున్న దాఖలాలు కనిపించలేదు. ఈ అక్రమ గ్రావెల్ తరలింపుపై రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులకు తరచూ ఫిర్యాదులు వెళు తున్నాయి. అయినా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా కోట్లు విలువ చేసే గ్రావెల్ మట్టి అక్రమ మార్గంలో తరలిపోయింది. గ్రావెల్ మాఫియాతో అధికార యంత్రాంగం లాలూచీ పడ్డంతోనే చర్యలు కానరావడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖల అధికారులు స్పందించి గ్రావెల్ మాఫియా ఆగడాలకు చెక్ పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రూ.1.90 కోట్లతో మెయిన్‌రోడ్డు పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - పాయకరావుపేట: పాయకరావుపేట మెయిన్ రోడ్డు నిర్మాణానికి ఎట్టకేలకు శంకుస్థాపన చేశారు. సుమారు రూ.1.90కోట్లతో 1.9 కిలోమీటర్ల పొడవు, 7మీటర్ల వెడల్పు రోడ్డు వేసేందుకు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, ఎంపీ బీశెట్టి సత్యవతి, వీఎమ్మార్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల చేతుల మీదుగా మెయిన్‌రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెయిన్‌రోడ్డు నిర్మాణంతో ప్రజల్లో ఆనందోత్సవాలు నెలకొన్నా యని తెలిపారు. ఏడాదిగా కష్టపడితే రోడ్డు నిర్మాణం జరిగిందని తెలిపారు. ప్రతిపక్షాలు సహకరించకపోవడం వల్ల రోడ్డు నిర్మాణం ఆలస్యమైందని తెలిపారు. భవిష్యత్తులో రోడ్డు విస్తరణ జరుగు తుందని తెలిపారు. ప్రజల అవసరం మేరకు అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లంకా సూర్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, జిల్లా ప్రచార కమిటీ విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పల్లెల మణికంఠ స్వామి, కోఆప్షన్ సభ్యులు కాదా రామకృష్ణ, ఇసరపు తాతారావు, గారా ప్రసాద్, జగతా శ్రీను, దేవవరపు రాజేష్‌ఖన్నా, ధనిశెట్టి బుజ్జి, ధనిశెట్టి మహేష్, గదుల లోవరాజు, కేశనకుర్తి సత్తిబాబు, ఎంపీడీఓ సాంబశివరావు, తహశీల్దార్ జయప్రకాష్, విఎంఆర్‌డిఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీలో పలు సేవలు: చైర్మన్ కోలా గురువులు

విశాలాంధ్ర - ఆనందపురం: డీసీసీబీ బ్యాంక్ పూర్తి సహాయ సహకారాలను అందిస్తుందని చైర్మన్ కోలా గురువులు తెలిపారు. ఆనందపురం మండలంలో నూతన భవనాన్ని సందర్శించి మాట్లాడారు. వ్యవసాయానికి సంబంధించి అన్ని రకాల రుణాలను అందిస్తామని ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి రైతుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చెప్పినట్లుగా అండగా ఉంటామని అన్నారు. అలాగే త్వరలో డీసీసీబీ ఏటీఎంలను ఏర్పాటు చేస్తామని ఇప్పటివరకు 2100 కోట్లు నగదు లావాదేవీలు జరిగాయని, డిపాజిట్లు రూపంలో 900 కోట్లు వచ్చాయని, రెండు లక్షల 24 వేల మంది రైతులకు 1150 కోట్లు రుణాల రూపంలో ఇచ్చామని అన్నారు. మరల మార్చి నెలలో 2500 కోట్లు రైతుల అవసరం కోసం తక్కువ వడ్డీతో రుణాలు ద్వారా అంది స్తామని తెలిపారు. బంగారం ద్వారా 280 కోట్లు రైతులకు 0 వడ్డీతో ఒక ఎకరానికి 5 లక్షలు, రెండు ఎకరాలకు 10 లక్షలు,

రైతులకు 20 లక్షల వరకూ మంజూరు చేస్తామని, సకాలంలో పంట రుణాలు చెల్లించినట్లయితే సున్నా వడ్డీతో రుణాలు ఇస్తామన్నారు. అనంతరం మండలంలో రైతులకు 5 లక్షలు చొప్పున పెంటయ్యకు 340000, కెల్ల రమణ 385,000 రుణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఈవో డీవీఎస్ వర్మ, డీసీఎంఎస్ డైరెక్టర్, పీఏసీఎస్ అధ్యక్షులు పాండ్రంకి అప్పారావు, సెక్రటరీలు కోటేశ్వరరావు, దశావతారం, పంచముఖేశ్వరరావు, నోడల్ ఆఫీసర్ రామకృష్ణ, పీఏసీఎస్ డైరెక్టర్ లింగం వెంకట్రావు, స్కూల్ కరస్పాండెంట్ చందక పాండురంగ, సూపర్వైజర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో వలిసెలు సాగుకు ప్రోత్సాహం

గీతం యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ మంజుశ్రీ

విశాలాంధ్ర - అరకులోయ: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలంలో వలిసెలు సాగు చేసే రైతులకు తాము సంపూర్ణంగా ప్రోత్సహిస్తామని గీతం యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ మంజుశ్రీ అన్నారు. మండలంలో చినలబుడు పంచాయతీ హట్టగూడ గ్రామంలో శనివారం నిర్వహించిన ఉచిత వలిసెలు విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీలో వలిసలు సాగుకు ప్రోత్సాహం లేక అంతరించిపోతుందని దానిని గుర్తించి కేంద్ర ప్రభుత్వం డిపార్ట్మెంట్ సైన్స్ టెక్నాలజీ విభాగం ఆర్థిక సాయంతో వలిసెలు సాగుకు ప్రోత్సహించాలని నిర్ణయించామన్నారు. ఇందులో భాగంగా ఎంపిక చేసిన 500 గిరిజన రైతు కుటుంబాలకు వలిసెలు సాగుకు దానికి అనుబంధంగా తేనెటీగల పెంపకానికి ప్రోత్సహిస్తామన్నారు. అలాగే హట్టగూడ, ఎండపల్లివలసలలో వలిసెలు నూనె, తేనె ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న మూడేళ్ల అందుకు అవసరమైన విత్తనాలు శిక్షణలు, యంత్రపరికారాలను అందజేస్తామన్నారు. అనంతరం గిరిజన రైతులకు ఉచితంగా మేలైన వలిసెలు, విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గీతం ప్రొఫెసర్ ఇమాంది, శరత్ బాబు, డి.ఎస్.టి ప్రాజెక్టు ప్రతినిధులు కిరణ్, శ్రీనివాస్, నాగరాజు, నాగేశ్వరరావు, నాగేంద్ర, చినలబుడు సర్పంచ్ ఉపేంద్ర పాల్గొన్నారు.

అంతర్జాతీయ అథ్లెటిక్స్ క్రీడాకారిణికి రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: అథ్లెటిక్స్ అంతర్జాతీయ మీట్‌లో దూసుకుపోతున్న విశాఖకు చెందిన జ్యోతి యర్రా జీకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అథ్లెటిక్స్ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ఆమె తల్లిదండ్రులకు లక్ష రూపాయలు చెక్కును ప్రోత్సాహంగా అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు వారిని సత్కరించారు. రాష్ట్ర వార్షిక జనరల్ బాడీ సమావేశం శనివారం విశాఖపట్నం ఇసుకతోట మై రెస్టారెంట్ మీటింగ్ హాల్లో రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అథ్లెటిక్స్ క్రీడాకారులను తయారు చేసుకునే బాధ్యత మనందరిపై ఉందని, ఆ దిశగా అందరూ కృషి చేయాలని కోరారు. 2019లో జాతీయ అథ్లెటిక్స్ పోటీలు గుంటూరులో నిర్వహించామని, అన్ని జిల్లాల్లో అథ్లెటిక్స్ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసుకోవాలని, జూనియర్ మీట్, సౌత్ జోన్ మేట్ వంటి క్రీడలు అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. తండ్రి ఓ సాధారణ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ తన కూతురుకు ప్రోత్సాహం ఎంతో అందించారన్నారు. ప్రతి జిల్లాలో టోర్నమెంట్లు నిర్వహించాలని కోరారు. రానున్న సెప్టెంబర్‌లో అథ్లెటిక్స్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశానికి అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల హైమ, జాయింట్ సెక్రటరీలు ఎన్.విజ యకుమార్, హర్షవర్ధన్, రంగారావు, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, విశాఖ జిల్లా అథ్లెటిక్స్ అధ్యక్ష, కార్య దర్శులు డి.నాగేశ్వరరావు, ఎం.నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల తొలగింపు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి

ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కోన లక్ష్మణ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: పంచాయతీ రాజ్ శాఖలో 731 మంది టెక్నికల్ అసిస్టెంట్ కంప్యూటర్ ఆపరేటర్ల తొలగింపు చర్య అమానుషమని, వారిని విధుల్లో కొనసాగించాలని ఏఐటీయూసీ అనకాపల్లి జిల్లా సమితి కన్వీనర్ కోన లక్ష్మణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద గత 13 ఏళ్లుగా టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లుగా ఆయా జిల్లాలలో పని చేస్తున్న 731 మందిని శనివారం నుంచి విధులకు రావాల్సిన అవసరం లేదని, నిధుల కొరత వల్ల తొలగిస్తున్నామని పంచాయతీరాజ్‌లోని ప్రధాన ఇంజినీరింగ్ అధికారి ఉత్తర్వులు జారీ చేయడాన్ని ఏఐటీయూసీ అనకాపల్లి సమితి తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. 13 ఏళ్లగా సర్వీసు ఉన్న ఔట్ సోర్సింగ్ సిబ్బందిని నియమ, నిబంధనలు పాటించకుండా ఏపీ సీఓఎస్ నోటీసులు జారీ చేయడం అప్రజా స్వామికమన్నారు. సమావేశంలో వియ్యపు రమణరావు, మద్దాల రమణజీ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే అనిత అరెస్ట్, విడుదల

విశాలాంధ్ర - యలమంచిలి: పాయకరావుపేట మెయిన్ రోడ్డు శంకుస్థాపన పనులను అడ్డుకుంటారనే నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే, తెలుగు దేశం పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనితతో పాటు పలువురు నాయకులను అరెస్టు చేసి అనంతరం విడుదల చేశారు. పాయకరావుపేట వస్తున్న వంగలపూడి అనితను నక్కపల్లి సీఐ అప్పన్న ఆధ్వర్యంలో వేంపాడు టోల్గేట్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. సమాచారం తెలుసుకున్న నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు టోల్ గేట్ వద్ద చేరుకున్నారు. అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. అక్కడ నుంచి ఎలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్ కి తరలించారు. వంగలపూడి అనిత తో పాటు టిడిపి నాయకులపై కేసు నమోదు చేశారు. గంటసేపు అనంతరం వీరందరినీ విడుదల చేశారు.

ఓటర్ల జాబితా సర్వే పరిశీలన

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో ధర్మవరం గ్రామంలో జరుగుతున్న ఓటర్ల జాబితా సర్వేను పాయకరావుపేట నియోజకవర్గం ఈఆర్వో రామలక్ష్మి పరిశీలించారు. శనివారం గ్రామంలోని పలు ఓటర్ల వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బీఎల్వోకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ విజయకుమార్, డిప్యూటీ తహశీల్దార్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కు పంచ గ్రామాల సమస్యపై వినతి

విశాలాంధ్ర - సింహాచలం: గ్రేటర్ విశాఖ 89వ వార్డు పరిధి సింహాచలంలో వారాహి యాత్రలో భాగంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కొద్దిసేపు ఆగారు. స్థానిక నాయకులు మజ్జి సూరిబాబు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనపై పుష్ప వాన కురిపించారు. పిదప స్థానిక నాయకులు ఆయనకు పంచ గ్రామాల సమస్యపై ఓ వినతిపత్రం అందజేశారు. అనంతరం పవన్ పెందుర్తి వెళ్లారు. గోపాలపట్నం సీఐ నరసింహారావు ఆధ్వర్యంలో పటిష్ట పోలీస్ బందబస్తు ఏర్పాటు చేశారు.

కేజీహెచ్‌లో చురుగ్గా అభివృద్ధి పనులు: కలెక్టర్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: కేజీహెచ్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున శనివారం ఉదయం పరిశీలించారు. కేజీహెచ్‌లో అత్యవసర చికిత్స విభాగంలో ఆధునీకరణ పనులను, క్లినికల్ ల్యాబ్‌ను, ప్రధాన ద్వారం వద్ద నిర్మిస్తున్న ఆర్చ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ అత్యవసర చికిత్స విభాగం విస్తరణ పనులను రూ.30 లక్షలతో చేపడుతున్నట్లు తెలిపారు. అదే విధంగా 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా అత్యవసర క్లినికల్ ల్యాబ్ రూ.15 లక్షలతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.శివానంద, వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుంభా రవిబాబుకి శుభాకాంక్షలు

విశాలాంధ్ర - అనంతగిరి: గవర్నర్ కోటా ఎమ్మెల్సీ కుంభా రవిబాబుని ఎంపీపీ శెట్టి నీలవేణి, ఎస్టీ కమిషన్ సభ్యురాలు రామలక్ష్మి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గిరిజన తెగకు చెందిన కుంభా రవిబాబుకి ఎమ్మెల్సీ అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన ప్రాంత అభివృద్ధికి రవిబాబు మరింత కృషి చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి కో ఆప్షన్స్ షేక్ మదీనా, ఉపాధ్యాయులు రామచంద్రరావు, పాత్రికేయులు శ్రీను, చందు తదితరులు పాల్గొన్నారు.

నాగబాబును కలిసిన రాయపురెడ్డి కృష్ణ

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల నియోజకవర్గం జనసేన నాయకులు రాయపురెడ్డి కృష్ణ జనసేన పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కొణిదల నాగబాబును శనివారం విశాఖపట్నం నోవాటెల్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాడుగుల నియోజకవర్గంలో గల సమస్యలను, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు చేస్తున్న అరాచకాలను, శారదానదిలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాల గురించి వివరించారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయకేతనం ఎగరవేయాలని, పార్టీలోకి కొత్తవారిని ఆహ్వానిస్తూ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కష్టపడి పనిచేయాలని తెలియజేశారు.

సవరణ

ఆగస్టు 12న విశాలాంధ్ర దినపత్రికలో వచ్చిన మాకిరెడ్డిలో కడదాకా కమ్యూనిస్టు భావాలే వార్తలో దివంగత కామ్రేడ్ మాకిరెడ్డి దేముడు బాబుకు బదులుగా రామునాయుడు అని వచ్చింది. పొరపాటున వచ్చిన తప్పును అన్యథా భావించవద్దని విజ్ఞప్తి.

అయ్యన్న కళాశాలలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - కె.కోటపాడు: స్థానిక అయ్యన్న విద్యా సంస్థలలో విద్యార్థులు, ఉపాధ్యా యులు, అధ్యాపకులు 76వ స్వాతంత్ర దినోత్సవాన్ని ముందస్తుగా శనివారం ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు ప్రదర్శించిన వివిధ విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మువ్వన్నెల పొడవాటి పతాకం రెపరెపలాడుతూ 76వ స్వాతంత్ర్య దినోత్సవానికి విశేష ఆకర్షణగా నిలిచింది. అలాగే "76"వ సంఖ్య అకారంలో విద్యార్థులు ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా ఆకట్టుకుంది. విద్యార్థులకు అయ్యన్న విద్యా సంస్థల అధినేత డాక్టరు ఖాశీం ఇండిపెండెన్స్ డే శుభాకాంక్షలు ముందుగా చెప్పారు. అలాగే వారికి అభినందనలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు...

విశాలాంధ్ర - పాయకరావుపేట: గ్రామాల్లో ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తెలిపారు. మండలంలోని గుంటపల్లి గ్రామంలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇసరపు తాతారావు, జగతా శ్రీను, పల్యాల లచ్చబాబు, నామవరం సీతారామస్వామి ఆలయం చైర్మన్ గదుల లోవరాజు, బొడ్డా శ్రీదేవి, కొంకిపూడి రామకృష్ణ, ఎంపీడీఓ సాంబశివరావు, ఇన్‌ఛార్జి ఈఓపీఆర్‌డి వై.సత్యనారాయణ, ఏఈలు కచేరి, మనోజ్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన న్యూట్రాస్యూటికల్ వినియోగం

విశాలాంధ్ర - మధురవాడ: మూలికలు, పోషకాలతో రూపొందించబడిన న్యూట్రా స్యూటికల్స్ రోగనిరోధక శక్తిని, సంపూర్ణ నివారణలకు ప్రసిద్ధి చెందాయని ముఖ్యంగా కోవిడ్-19 తరువాత వీటిపై ప్రజలలో అవగాహన, వినియోగం పెరిగిందని బొటానిక్ హెల్త్ కేర్ సంస్థ వ్యవస్థాపకుడు గౌరవ్ సోనీ వెల్లడించారు. తమ సంస్థ పరిశోధనా విభాగం డైరెక్టర్ డాక్టర్ హెచ్.ఎన్.శివప్రసాద్‌తో కలిసి శనివారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సందర్శించిన ఆయన స్కూల్ ఆఫ్ ఫార్మశీలో విద్యార్థులను, పరిశోధకులను, అధ్యాపకులను ఉద్దేశించి న్యూట్రాస్యూటికల్స్‌లో భారతీయ ఔషధ మొక్కల ప్రాధాన్యతపై ప్రసంగించారు. కార్యక్రమానికి స్కూల్ ఆఫ్ ఫార్మశీ అసోసియేట్ ప్రొఫెసర్ కె.సునీత సంధానకర్తగా వ్యవహరించారు.

నాటు తుపాకి తూటాకు బలైన గిరిజనుడు

విశాలాంధ్ర - పెదబయలు: మండలంలో మారుమూల లింగేటి పంచాయతీ వన కొత్తూరు గ్రామ అడవిలో పందుల వేటకు వెళ్లి నాటు తుపాకి ఓ గిరిజనుడు బలయ్యాడు. ఎస్సై మనోజ్ కుమార్ అందించిన వివరాలు మేరకు జి.మడుగుల మండలం కిల్లంకోట పంచాయతీ కప్పలు గ్రామానికి చెందిన బుటారి మల్లన్న, ఎంద్రపల్లి సూరిబాబు, బుతారి బొంజు బాబు, బుటారి సింహాచలం, లొంబోరి సుబ్బారావు, జన ఐదుగురు కలిసి ఈనెల 11వ తేదీన లింగేటి పంచాయతీ వన కొత్తూరు అటవీ ప్రాంతంలో అడవిపందుల వేటకు వెళ్లిన అనంతరం స్వగ్రామానికి అటవీ ప్రాంతం నుంచి వెళుతుండగా మార్గమధ్యంలో అడవి పంది బుటారి బొంజు ముందు తారసపడగా ఎంద్రవల్లి సూరిబాబు వేటకు ఉపయోగించిన నాటు తుపాకీ పందికి గురిపెట్టి కాలుస్తుండగా అడ్డుగా ఉన్న బొంజు బాబుకి వెనుక భాగంలో తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో పెదబయలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. త్వరలో ముద్దాయిని అరెస్టు చేసి రిమాండ్ తరలిస్తామని ఎస్సై మనోజ్ కుమార్ తెలిపారు.

అంతర్జాతీయ యువజన దినోత్సవం

విశాలాంధ్ర - భీమిలి: అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా శనివారం విశాఖపట్నంలో ఉన్న ఈకో క్లబ్ వారు భీమిలి కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయంలో యువజన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ గంగా కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఈకో క్లబ్ సంస్థ ప్రతినిధి డా. శశి ప్రభ, వారి సిబ్బంది పాల్గొని విద్యార్థులతో మమేకమై యువజన దినోత్సవం యొక్క ఆవశ్యకతను వివరించారు. డా. శశి ప్రభ మాట్లాడుతూ అంతర్జాతీయ యువజన దినోత్సవం ప్రతీ సంవత్సరం ఆగస్టు 12వ తేదీన జరుపుకుంటారని అన్నారు. యువత యొక్క సామర్థ్యాన్ని పెంపొందించుటకు, అందరికీ మంచి భవిష్యత్తును సృష్టించేందుకు కట్టుబడి ఉండే రోజునే అంతర్జాతీయ యువజన దినోత్సవంగా ప్రకటించారని అన్నారు. యువత ప్రపంచ పర్యావరణంపై ప్రత్యేక దృష్టి కేంద్రీ కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈకో క్లబ్ ప్రతినిధులు రత్నం, ప్రసాద్, భాస్కర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గవర్నర్ కోటాలో కుంభా రవిబాబుకు ఎమ్మెల్సీ పదవి పట్ల హర్షం

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: అల్లూరు జిల్లా మాజీ రాష్ట్ర ఎస్టీ కమిషనర్ కుంభా రవిబాబుకు గవర్నర్ కోటలో ఎమ్మెల్సీ పదవి కల్పించడం హర్షనీయమని వైసీపీ నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం నాలుగు రోడ్ల కూడలి వద్ద గల వైయస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వైసీపీ మండల అధ్యక్షుడు పాంగి మల్లికార్జునరావు, వైస్ ఎంపీపీ సీర్గం భాగ్యవతి ఎస్టీ కమిషనర్ పదవిలో ఉన్నప్పుడు ఆయన చేసిన సేవలను సీఎం గుర్తించారన్నారు. వైసీపీ పార్టీలో ఉండి నమ్ముకున్న వారికి రాష్ట్ర ముఖ్యమంత్రి సముచిత స్థానం కల్పిస్తున్నారని అన్నారు. 2024 ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జర్రెల సర్పంచ్ బోర్గం భాగ్యవతి, సుజనకోట ఎంపీటీసీ మజ్జి సుబ్బలక్ష్మి, వైసీపీ నేతలు జరగబంధు, ఎస్.తిరుపతిరావు, జయదేవ్, కె.దాసు, జి.సన్యాసిరావు, రాజారావు, బాబురావు, వి.మణి, వి.సుభాష్ చంద్ర, వి.నాని బాబు పాల్గొన్నారు.

అనాధ పిల్లలకు నిత్యావసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర - కశింకోట: మండల తెలుగు యువత ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ జన్మదిన వారోత్సవాలలో భాగంగా శనివారం కొక్కిరాపల్లి ప్రేమ సమాజంలో అనాధ పిల్లలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కాయల మురళీ, ఉగ్గిన రమణమూర్తి, గొంతిన శ్రీనివాసరావు, వేగి గోపి, కలగా సోమేశ్వరరావు, బుదిరెడ్డి గంగయ్య చేతుల మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు సిదిరెడ్డి సూర్యనారాయణ, ఒమ్మి సత్యనారాయణ, బుదిరెడ్డి రామారావు, మజ్జి నిరంజన్ కుమార్, నానిబాబు, జెర్రిపోతుల నూకినాయుడు, నైనంసెట్టీ రమణారావు, ఉల్లింగల రమేష్, ద్వారపురెడ్డి సత్తిబాబు, ఆనాల తాతీలు నాయుడు, పక్కుర్తి సంతోష్, పారిపిల్లి నూకరాజు, కొఠారి సంతోష్, మజ్జి ప్రసాద్, పిల్లి ఆనంద్, మనసాల నానాజీ, అప్పలనాయుడు, చేబ్రోలు సూరిబాబు, కర్రి దుర్గినాయుడు, వెంకటరావు, సంజీవ్, చినరమణ, సారిపిల్లి నానీబాబు, పువ్వల రమేష్, యస్.శ్రీను, కరణం గోవింద పాల్గొన్నారు.

ఏయూ జర్నలిజం విద్యార్థులకు వీసీ దిశానిర్దేశం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్రవిశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం విద్యార్థులకు వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి దిశానిర్దేశం చేసారు. తన కార్యాలయంలో విద్యార్థులతో మాట్లాడారు. మీడియా రంగంలో చోటుచసుకుంటున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. జర్నలిజం కోర్సు పూర్తిచేసే నాటికి జ్ఞానంతో పాటు ప్రత్యక్ష అవగాహన కలిగి ఉండాలన్నారు. జర్నలిజం పూర్తిచేసిన విద్యార్థులు స్టార్టప్ సంస్థలను ప్రారంభిస్తే తాము అవకాశం ఇస్తామన్నారు. ఏయూ స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్‌లో వీరికి అవసరమైన వసతులు కల్పించి, మార్గదర్శకం అందించడం జరుగుతుందన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న ఏయూ లుక్స్ సంచికల రూపకల్పనలో జర్నలిజం విద్యార్థులు భాగం కావాలని సూచించారు. విద్యార్థులు నిత్యం కొంత సమయాన్ని వెచ్చించాలన్నారు.త్వరలో వంద సంవత్సరాల వేడుకను జరుపుకుంటున్న ఆంధ్రవిశ్వవిద్యాలయంలో యువత భాగస్వామ్యం పెంచే ప్రయత్నం జరుగుతోందన్నారు. ప్రతీ విద్యార్థి ప్రత్యక్షంగా ఏయూ కళాశాలలు, విద్యార్థులు, పూర్వవిద్యార్థులకు సంబంధించిన ఆసక్తిదాయక ప్రత్యేక కథనాలను అందించాలని సూచించాను. నూతన ఆలోచనలు స్వీకరించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, నవ్య ఆలోచనలతో పనిచేయాలని సూచించారు. విదేశీ విద్యార్థుల భాగస్వామ్యం సైతం దీనిలో స్వీకరిస్తామన్నారు. ఏయూ తీర్చిదిద్దుతున్న ఏయూ లుక్స్ తెలుగు, ఆంగ్ల వారపత్రికలు వేలాది మంది పూర్వవిద్యార్థులు చూడటం జరుగుతోందన్నారు. దీనిని ఆకర్షణీయంగా, ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దే బాధ్యతను అందరూ స్వీకరించాలని సూచించారు. రానున్న కాలంలో మరిన్ని మార్పులు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ సి.ఎం. వినయ కుమార్, మీడియా రిలేషన్స్ డీన్ ఆచార్య చల్లా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తల్లి మందలించిందని మనస్థాపంతో యువకుడు ఆత్మహత్య

విశాలాంధ్ర - హుకుంపేట: తల్లి మందలించిందని మనస్థాపానికి గురైన యువకుడు ఇంటిలో ఆత్మహత్య చేసేకొని మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనిని సంబంధించిన వివరాలు స్థానిక ఎస్ఐ సతీష్ కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. మండలంలో కోడ కనకాలమ్మకు పాడేరు మండలం వనుగుపల్లి గ్రామంలో వివాహం జరిగింది. కుమారుడు పుట్టి కొన్ని రోజులకు భర్త మోహన్‌రావు మృతి చెందటంతో కనకలమ్మ తన కుమారుడితో హుకుంపేట మండలం శోభ కోట పంచాయతీ సుండ్రిపుట్టు గ్రామంలో కోడ జీవన్‌రాజును మరల పెళ్లి చేసుకుని తన వద్ద ఉంటూ జీవనం సాగిస్తుంది. వీరవెంకట వరప్రసాద్ మోదపుట్టు ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి వరకు చదివి మానేశాడు. పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటూ జులాయిగా తిరగడంతో తల్లి కనకాలమ్మ చదువుకోకుండా, పొలం పనులకు సహాయం చెయ్యకుండా పశువుల కాపునకు కూడా వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నావని మందలించింది. దీంతో మనస్థాపానికి గురై ఇంటిలో దూలానికి ఉరి వేసుకొని మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతి చెందిన యువకుడు కొన్ని రోజులు వనుగుపల్లిలో, కొన్ని రోజులు సుండ్రిపుట్టులో గడిపేవాడని అయితే సుండ్రుపుట్టు వచ్చి వారం రోజులు అవుతుందని వారు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ సతీష్ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ప్రధాన రహదారికి డ్రైన్లు నిర్మించాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట: పాయకరావుపేట మెయిన్‌రోడ్డు నిర్మాణానికి ముందుగానే డ్రైన్లు నిర్మించాలని వికాస తరంగిణి సభ్యులు చిక్కాల శ్రీనివాసరావు, జనసేన పార్టీ నాయకురాలు నారపురెడ్డి పద్మావతి కోరారు. మెయిన్‌రోడ్డు శంకు స్థాపనకు విచ్చేసిన ఎమ్మెల్యే, ఎంపిలకు వినతిపత్రం అందజేశారు. మెయిన్‌రోడ్డు విస్తరణ రాజకీయాల కారణంగా ఆగిపోయిందని తెలిపారు. ప్రస్తుతం వేస్తున్న రోడ్డు కారణంగా సెంట్రల్ లైటింగ్‌తో కూడిన మెయిన్‌రోడ్డు విస్తరణ పాయకరా వుపేట ప్రజల కల నెరవేరలేదన్నారు. ప్రస్తుతం 7మీటర్ల రోడ్డు వెడల్పుతో 1.90కిలోమీటర్ల మేర వేస్తున్న రోడ్డుకు సరైన డ్రైనేజీలు లేదన్నారు. కోట్లతో రోడ్డు నిర్మించినా డ్రైన్లు లేకపోతే వేస్తున్న రోడ్డు త్వరగా పాడయ్యే అవకాశం ఉందని వినతిపత్రంలో పేర్కొన్నారు.

మణిపూర్ ఘటనకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండకు వ్యతిరేకంగా విశాఖ లోని, ప్రీచర్స్ ఫెలోషిప ఆధ్వర్యంలో క్రైస్తవ సంఘాలు సంఘటితంగా శాంతి ర్యాలీని నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీ ప్రారంభంలో ఏపీ టూరిజం డైరెక్టర్ రేవతి డేవిడ్ రాజు మాట్లాడుతూ మణిపూర్లో క్రైస్తవ మహిళలపై జరిగిన దాడి భారతదేశంలోని ప్రతి మహిళపై జరిగిన దాడిగా మనం గుర్తించి నిరసన తెలియజేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ మాట్లాడుతూ ఇప్పటికే మణిపూర్లో మూడునెలలుగా జరుగుతున్న ఈ మారణ హెూమంలో 175 మంది ప్రాణాలు కోల్పోయారని, 60 వేల మంది నిరాశ్రయులయ్యారని, ఎన్నో గ్రామాలు ప్రజలు తమ ఊర్లు విడిచి వెళ్లిపోవడం జరిగిందని, ఇలాంటి పరిస్థితి మును పెన్నడు ఏ రాష్ట్రంలోనూ లేదని ఈ యొక్క మారణ హెూమాన్ని ఆపే దిశగా కేంద్ర ప్రభుత్వం మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మణిపూర్లో క్రైస్తవుల చర్చిలపై, క్రైస్తవుల హాస్పిటల్ క్రైస్తవుల స్కూల్స్, క్రైస్తవుల ఆస్తులపై జరుగుతున్న ఉద్దేశకర పూరిత దాడులను అరికట్టాలని కోరారు. ఇలాంటి చర్యలు భారతదేశంలో జరగడం వల్ల ప్రపంచ దేశాలలో భారతదేశం చులకన అవుతుందని, భారతదేశం ముస్లిం వ్యతిరేకి అని క్రైస్తవ వ్యతిరేకం అని ప్రపంచ దేశాలలో ముద్రపడితే భారతదేశం యొక్క అభివృద్ధి కుంటుపడుతుందని, అందువల్ల భారతీయులను ఇతర దేశాల వారు చులకనగా చూసే అవకాశం ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిచర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు చుక్క మాణిక్యం డేవిడ్, సెక్రెటరీ శంకర్ దానియల్, పాస్టర్ రామరాజు, పాస్టర్ నవీన్, పాస్టర్ విక్టర్ రాజు, పాస్టర్ నూకరాజు, పాస్టర్ అనకాపల్లి డేవిడ్ శిరీష, విజయ, అంజలి పాల్గొన్నారు.

నా భూమి - నా దేశం ప్రతి ఒక్కరికి ఆదర్శం కావాలి

విశాలాంధ్ర - చింతపల్లి : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించి అమలు చేస్తున్న నా భూమి - నా దేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం అనే కార్యక్రమం ద్వారా అమరులైన స్వాతంత్ర సమరయోధులకు నివాళులు అర్పించడం శుభ పరిణామం అని బలపం సర్పంచ్ రమేష్ నాయుడు, ఎంపీటీసీ మచ్చుల మచ్చమ్మా అన్నారు. మండలంలోని మారుమూల పంచాయతీ అయిన బలపం పంచాయతీ ఆశ్రమ పాఠశాల ఆవరణలో స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన నా భూమి నా దేశం కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జరుపు తున్న ఆజాదికా అమృత్ మహెూత్సవ్‌లో భాగంగా గత ఏడాది హర్ ఘర్ తిరంగా కార్యక్రమం అలాగే ఈ ఏడాది మేరీ మట్టి మేరీ దేశ్ కార్యక్రమంలో నేల ఈ తల్లికి నమస్కారం, అమరులకు వందనం కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ ఎంపీటీసీ బి బాబురావు, పంచాయతీ కార్యదర్శి చిన్నం నాయుడు, సచివాలయ, మెడికల్ సిబ్బంది ఎన్ఆర్ఈజీఎస్, వెలుగు సిబ్బంది, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కలిగొట్ల శ్రీ పైడితల్లమ్మ అమ్మవారి హుండీ చోరీ

విశాలాంధ్ర - దేవరాపల్లి: మండలంలో కలిగొట్ల గ్రామంలో శ్రీ పైడితల్లమ్మ అమ్మవారి ఆలయ హుండీ తాళం పగలగొట్టి నగదు దొంగిలించారు. రోజువారిలా ఆలయ పూజారి ధూపదీప నైవేద్యాలు సమర్పించాడానికి ముప్పిరెడ్డి చెల్లయ్యమ్మ శనివారం ఉదయం 6 గం

సమయంలో వచ్చి చూడగా ఆలయం బయట ఉన్న హుండీ తాళం పగలగొట్టి ఉండటం చూసి వెంటనే ఆలయ ధర్మకర్త బోద్దు పాలవెల్లి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వటం జరిగింది. వెంటనే పాలవెల్లి వచ్చి ఆలయ ప్రాంగణంలో చుట్టూ చూస్తే ఒక వైపు తాళం పగలగొట్టి ఉండటం చూసి వెంటనే దేవరాపల్లి పోలీసు స్టేషన్‌కు వెళ్లి హుండీలో పది హేనువేల నుంచి ఇరువై వేల రూపాయలు ఉంటాయని శనివారం ఫిర్యాదు చేయ్యగా, వెంటనే స్థానిక యస్సై డి.నాగేంద్ర స్పందించి వారి సిబ్బందిని ఆలయ ప్రదేశం పరిశీలించి నగదు దొంగలించిన వారిని అతి తొందరగా పట్టుకుంటామని తెలిపారు.

యస్.రాయవరంలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండల కేంద్రం ఎస్.రాయవరంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన కర్రి రాజీవ్ గాంధీ జ్ఞాపకార్థం వారు మిత్రమండలి పుట్టినరోజు సందర్భంగా హైస్కూల్ నందు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా సుమారు 80 మంది స్వచ్ఛందంగా వచ్చి రక్తాన్ని ఇవ్వడం జరిగింది. అమ్మ బ్లడ్ సెంటర్ మదర్ సెంటర్ సహకారంతో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పలువురికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి బొలిశెట్టి గోవిందరావు, మండల వైసీపీ కన్వీనర్ కొణతాల శ్రీనివాసరావు, గాంధీ మిత్ర మండలి బృందం, కర్రి శేఖర్ పితాన సతీష్, ప్రసాదు, సునీల్, మధు, పులి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అస్వస్థత

విశాలాంధ్ర - హుకుంపేట: వాతావారణంలో మార్పులకు పాఠశాలల్లో విద్యార్థినీ విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు. మండలంలో పెదగరువు ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థినీలు శనివారం హుకుంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందటా నికి శనివారం వచ్చారు. అధికంగా వర్షాలు కురిసి ఎండలు కాయటంతో వాతావరణంలో మార్పులకు విద్యార్థులు విష జ్వరాలకు, విరేచనాల బారిన పడుతున్నారు. ఆశ్రమ పాఠశాలకు చెందిన కె.సుజాత 9వ తరగతి, కె.మౌనికరాణి 8వ తరగతి, ఆర్.రాజేశ్వరి, 8వ తరగతి, ఎం.మమత 6వ తరగతి, ఎస్.దేవిప్రియ 4వ తరగతి, ఎం.అరుణ 8వ తరగతి చదువుతున్న విద్యార్థినీలు తీవ్ర కడుపు నొప్పి, జ్వరంతో బాధపడుతు శనివారం వైద్య సేవలు పొందారు. గతంలో పాఠశాలల్లో హెల్త్ వాలంటీర్ సిబ్బంది అందుబాటులో ఉండేవారని నేడు ఆ పరిస్థితులు లేకపోవటంతో చిన్న జ్వరం వచ్చినా ఆసుపత్రికి లేదా ఆర్ఎంపీ డాక్టర్ వద్ద చూపించుకోవాల్సి వస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

17న ఏఐటీయూసీ అల్లూరి జిల్లా మహాసభ

విశాలాంధ్ర - జి.మాడుగుల: అల్లూరి జిల్లా ఏఐటియుసి మహాసభ ఈనెల 17వ తేదీన పాడేరు జీసీసీ డివిజన్ గొడౌన్ ఆవరణలో నిర్వహించనున్నట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వండు బాబు శనివారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.మన్మథరావు ఈ సభకు హాజరుకానున్నారని అలాగే అన్ని మండలాల హమాలీలు, కార్మికులు, నాయకులు, మేస్త్రిలు పూర్తి స్థాయిలో సభకు హాజరుకావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జి.మాడుగుల హమాలీలు బాబురావు, కె.సత్తిబాబు, శ్రీను బాబు, సురేష్, మోహన్, బుజ్జి బాబు, జి.శ్రీను బాబు, త్రినాథు, జోసు సాగర్ పాల్గొన్నారు.

ఇంటింటి ఓటర్ల జాబితా వేగవంతం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఓటర్ల జాబితా ఇంటింటి సర్వే ప్రక్రియ త్వరతగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ కె.యస్.విశ్వనాధన్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. శనివారం ఉదయం భీమిలి, విశాఖ తూర్పు శాసన సభా నియోజక వర్గాల పరిధిలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే కార్యాక్రమంలో జాయింట్ కలెక్టరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ భార్యాభర్తలు వివిధ పోలింగ్ స్టేషన్లో ఓటరుగా నమోదై ఉన్నా లేదా ఓటర్ల జాబితాలో చేర్చకపోయినా, 18 సంవత్సరాలు నిండి ఓటరుగా నమోదు కాకపోయినా బియల్ఓ వారి ఇంటిని సందర్శించినప్పుడు క్షుణ్ణంగా తనిఖీ చేసి, ఫారం ఇచ్చి ఓటరు జాబితాను సరి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఆర్డీఓ బాస్కర్ రెడ్డి, స్టీల్‌ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు, భీమిలి, విశాఖ రూరల్ తహశీల్దార్లు, బియల్ఓ లు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి హర్ ఘర్ తిరంగా

విశాలాంధ్ర - గాజువాక సిటీ : స్వాతంత్ర్య దినోత్సవం ఉత్సవాల్లో భాగంగా గాజువాక పాతకర్నవానిపాలెం బీజేపీ కార్యాలయంలో నాయకులకు ప్రజలకు జాతీయ జెండాలను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి పిలుపుమేరకు ప్రతి ఇంటిపైన త్రివర్ణ పతాకం ఎగురవేయాలని అన్నారు. ఆ యొక్క పోటోలను సోషల్ మీడియా పత్రికల రిపోర్టర్లకు పంపించాలని అన్నారు. గత సంవత్సరం ప్రదాని మోదీ పిలుపు మేరకు 32 కోట్ల భారతీయులు తమతమ ఇంటిపై జెండా ఎగురవేసి దేశభక్తి నిరూపించుకున్నారని గుర్తుచేసారు. అది ప్రపంచ రికార్డు నమోదు చేసిందని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గూటూరు శంకరరావు, కోసూరు. తాతారావు,పేర్ల అప్పారావు, నాగేశ్వరరావు, శశిదరన్ పిళ్లై, రంజిత్, రాజశేఖర్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను కలిసిన ఎంపీటీసీ

విశాలాంధ్ర - ఎటపాక: ఎటపాక మండలం నూతన తహశీల్దారుగా ఎంపికైన పృధ్విని గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుత డిప్యూటీ తహశీల్దార్‌గా పని చేస్తున్న పృధ్వి ఎటపాక తహశీల్దార్ కార్యాలయంలో పనిచేసిన అనుభవం ఉన్నందున ప్రభుత్వం గుర్తించి తహశీల్దార్ బాధ్యతలను పృథ్వికి అప్పగించడం పట్ల ఎటపాక మండల ప్రజా ప్రతినిధులు, ప్రజలు పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గుండాల ఎంపిటిసి గొంగడి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఎటపాక మండలంలో ఉన్న పలు సమస్యలను తహశీల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో మోర్తాల రామిరెడ్డి, ఆర్తి మల్ల రామ చంద్రరావు, బారెడ్డి లక్ష్మారెడ్డి, బారెడ్డి నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల సర్వే చేయాలి
నర్సీపట్నం ఆర్డీవో జయరాం

విశాలాంధ్ర - మాకవరపాలెం: పారదర్శకంగా ఓటర్ల సర్వే చేయాలని నర్సీపట్నం ఆర్డీవో

హెచ్‌వి.జయరాం సూచించారు. శనివారం మాకవరపాలెం మండలంలో బూరుగుపాలెం, చామంతపురం గ్రామాల్లో జరుగుతున్న ఓటర్ల సర్వేను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటర్ల సర్వేపై నిర్లక్ష్యం తగదని, చేర్పులు తొలగింపులు విషయంలో పలు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఈయన వెంట తహశీల్దార్ ప్రసాదరావు, డిటి శంకరరావు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

విశాలాంధ్ర - సీలేరు: విశాఖపట్నం నుంచి భద్రాచలం వెళుతున్న ఆర్టీసి బస్సు సప్పర్ల

ఘాట్‌లోని రైన్ గేజింగ్ మొదటి టోర్నింగ్‌కు వచ్చేసరికి దారకొండ నుంచి వస్తున్న ఓమ్ని వ్యాన్ టర్నింగ్‌లో ఖాళీ లేకపోయినప్పటికీ నిలుపుదల చేయకుండా ముందుకు పోనిచ్చాడు. బస్సు డ్రైవర్ గట్టిగా హెచ్చరిస్తున్నా ఆగకుండా బస్సును రాసుకుంటూ పోయి కొంత దూరం వెళ్లి అక్కడ నిలుపుదల చేశాడు. ఓమ్నీ వ్యాన్ వెళు తున్న వైపు పెద్ద గొయ్యి ఉంది. ఆరుగురు ప్రయాణికులు ఉన్న వ్యాన్ ప్రమాదానికి గురైతే ప్రాణనష్టం కూడా సంభవించేది. వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపటంతో ప్రయాణికులు భయాందోళన గురయ్యారు. అయితే ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

ఘనంగా నగర సంకీర్తన వార్షికోత్సవం

విశాలాంధ్ర - మాకవరపాలెం: మండలం తామరంలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నగర సంకీర్తన వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇక్కడ నగర సంకీర్తన ప్రారంభించి శనివారం నాటికి 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నగర సంకీర్తన, కోలాటాలతో పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ట్రిపుల్ ఐటీకి తేజస్విని ఎంపిక

విశాలాంధ్ర - కశింకోట: మండలంలోని తాళ్లపాలెం గాయత్రి హైస్కూల్ విద్యార్థి కాలెపు తేజస్విని ఆర్‌జీయూకేటీ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఈ మేరకు సదరు విద్యార్థినిని అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతోపాటు ఆటలు పాటలులో కూడా రాణించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థినికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఏపీ టీఎస్ సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ స్టూడెంట్ బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ ఆధ్వర్యంలో గోపాలపట్నం జడ్పీహెచ్ స్కూల్ గ్రౌండ్లో జి.శ్రీనివాస్, పి.దివాకర్ మెమోరియల్ టూ స్టేట్స్ (ఏ.పి టి.ఎస్) ఆల్ సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు ప్రారంభోత్సవం చేశారు. ఆగస్టు 12 నుండి 13వ తేదీ వరకు ఈ టోర్నమెంట్ 21 జట్లతో జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ అధ్యక్షులు ఎన్.ఎస్.ప్రకాష్ రావు, కార్యదర్శి పి. రమణ పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: గద్దర్ అకాల మరణానికి చింతిస్తూ పెదగంట్యాడ కూడలిలో కణితి అప్పలరాజు అధ్యక్షతన ఘన నివాళులర్పించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన 75వ వార్డు

కార్పొరేటర్ పులి లక్ష్మీభాయి మాట్లాడుతూ గద్దర్ పోరాటాన్ని కొనియాడారు. ఆయన పాటలు మరువ లేనివి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు పులి రమణారెడ్డి, శ్రీమునిసిరి శ్రీను, వంశీ కృష్ణ, ములకపల్లి పెంటయ్య, పెద్దాడ సోమునాయుడు, ఎల్లంకి రమణ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - దేవరాపల్లి: దేవరాపల్లి పోలీస్ స్టేషన్ ఎస్సై డి.నాగేంద్ర గంజాయి తరలిస్తున్న ఐదుగురు ప్రకాశం జిల్లా వ్యక్తులను శనివారం పట్టుకుని ఒక కారుతో పాటు 6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ డి నాగేంద్ర మాట్లాడుతూ ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం నెలతురు గ్రామానికి చెందిన వడ్డెల వాసు (22), వడ్డెల అనీల్ (22), వడ్డెల పెదబాబు (19), రావూరి పవన్ (18)తో పాటు పదిహేడేళ్ల బాలుడు కలిసి కారులో చింతపల్లి మన్యానికి వెళ్లారు. గంజాయి కొనుగోలు చేసి పినకోట, దేవరాపల్లి మీదుగా ప్రకాశం జిల్లాకు పయనమయ్యారని, శ్రీరాంపురం వై జంక్షన్ వద్ద శనివారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు కారులో గంజాయిని తరలిస్తున్న ఐదుగురు పట్టుబడ్డారు. వెంటనే కారుని స్వాధీనం చేసుకుని వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చెయ్యగా 6 కేజీల గంజాయి పట్టుబడిందని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి కారుని, గంజాయిని సీజ్ చేశామని, నిందితుల్ని చోడవరం కోర్టులో హాజరుపరిచామని ఎస్ఐ తెలిపారు.

గాజువాక శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో ఆధునిక వసతులు

విశాలాంధ్ర - గాజువాక : గాజువాక శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో ఆధునిక వసతులుతో విస్తరిస్తున్నట్టు ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ మమతా మయి పాణిగ్రహి తెలిపారు. శనివారం స్థానిక బాలచెరువురోడ్డు ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సేవలు విస్తరణలో భాగంగా రానున్న అక్టోబర్ నుండి ఆధునిక ఆపరేషన్ థియేటరు అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రస్తుతం ఇక్కడ ఇద్దరు సీనియర్ కంటి వైద్యులు సహా పారామెడికల్ సిబ్బంది, ఆప్టికల్ షాప్, ఫార్మసీతో పాటూ పరిపాలన సిబ్బంది సేవలు అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. సామాజిక సేవలుతో ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నామన్నారు. ఇందులో రెండు అల్ట్రా మోడ్రన్ ఆపరేషన్ థియేటర్లు, 20 పడకల సౌకర్యం, అత్యాధునిక రోగ నిర్ధారణ విధానాలు, ల్యాబ్ సౌకర్యం, ఆప్టికల్ షాప్, ఫార్మసీ వంటివి పూర్తిస్థాయిలో ఉన్నాయన్నారు. గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రజలు ఈ సౌకర్యాలు పూర్తిగా వినియోగించుకోవాలని పిలుపు నిచ్చారు. అంధత్వాన్ని సాధించడానికి, ముందస్తుగా గుర్తించాడానికి క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ సమావేశంలో కంటి కన్సల్టెంట్ డాక్టర్ నటాషా, డిప్యుటీ జనరల్ మేనేజర్ కె.బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనకు సంఘీభావంగా శాంతి ర్యాలీ

విశాలాంధ్ర - అరకులోయ: మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులు, గిరిజనులపై జరిగిన దుర్ఘటనకు సంఘీభావంగా అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండల కేంద్రంలో క్రిస్టియన్ మినిస్ట్రీస్ ఇన్వైటెడ్ పాస్టర్స్ ఆధ్వర్యంలో శనివారం భారీ శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ పార్క్ నుండి ఆర్సీఎం చర్చి వరకు పార్టీలకు అతీతంగా భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ శాంతి ర్యాలీలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు సుజాత సాల్మన్ పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సుజాత సాల్మన్ మాట్లాడుతూ భారతదేశంలో భాగమైన మణిపూర్‌లో క్రైస్తవులు, గిరిజనులపై అల్లర్లు, విధ్వంసం, మారణ హోమం, ప్రాణ నష్టం జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం ఎందుకు మౌనం వహిస్తుందని వారు ధ్వజమెత్తారు. దేశంలో ఇలాంటి మతోన్మాద దుశ్చర్యలను ఖండించాలని ఎన్నారు. అనంతరం నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యపు మొండి వైఖరి విడనాడాలని మణిపూర్ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని కళ్ళకు గంతలు కట్టి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, రాజకీయ పార్టీ నాయకులు, క్రైస్తవ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని మార్చే శక్తి అధ్యాపకుల సొంతం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: సమాజాన్ని మార్చే శక్తి అధ్యాపకుల సొంతమని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. మంగళవారం ఏయూ హెచ్‌ఆర్‌డిసి కేంద్రంలో నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ ఇండక్షన్ ప్రోగ్రాం ముగింపు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ కృష్ణమోహన్ మాట్లాడుతూ సామాజిక అభివృద్ధికి దోహదకారిగా నిలవాలని సూచించారు. విద్యార్థిలో లోపాలను ఎత్తిచూపకుండా వారిని సరిదిద్ది మార్గదర్శకం అందించే బాధ్యతను పూర్తిస్థాయిలో నిర్వర్తించాలన్నారు. అధ్యాపకులు సామాజిక ఇంజనీర్లుగా నిలుస్తారన్నారు. భావిభారత పౌరులను తీర్చిదిద్దే గురుతర బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. తల్లిదండ్రుల తరువాత అంతటి గౌరవం గురువుకే దక్కుతుందన్నారు. భారత్ విశ్వగురువుగా మారాలని ప్రధాని నరేంద్రమోదీ ఆకాంక్షిస్తున్నారని, ఈ దిశగా యువతను తీర్చిదిద్దే బాధ్యత నేటితరం అధ్యాపకులపై ఉందన్నారు. ప్రతీ అధ్యాపకునికి నిజమైన సంపదగా నిలిచేది ఉన్నతంగా ఎదిగిన విద్యార్థులేనన్నారు. నిస్వార్ధంగా ఇక్కడ నేర్చుకున్న అంశాలను మీ కళాశలలో విద్యార్థులకు చేరువ చేసే దిశగా పనిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్‌లో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ సమాజంతో విద్యార్థులను అనుసంధానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్‌డిసి కేంద్రం సంచాలకులు ఆచార్య టి.వి. కృష్ణ, ఆచార్య ఎస్.ఏ.డి. పాల్ తదితరులు పాల్గొన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న 21 మంది అధ్యాపకులకు సర్టిఫికేట్లను ప్రధానం చేశారు.

విక్స్ వాపోరబ్ నూతన ప్రచార చిత్రం విడుదల

విశాలాంధ్ర - విశాఖ సిటీ: రుతుపవనాలు వేడి నుంచి ఆనందం, ఉపశమనాన్ని అందిస్తుండగా, తరచుగా మారిపోతున్న ఉష్ణోగ్రతలు, పెరిగిన తేమ, తేమ కారణంగా అంటువ్యాధులు, జలుబు మరియు దగ్గు లక్షణాలు కూడా వృద్ధి చెందుతాయి. ఇది పిల్లలు అనారోగ్యానికి గురయ్యే లేదా వైరస్ బారిన పడే అవకాశాలను పెంచుతుంది. విక్స్ హృదయపూర్వక కొత్త క్యాంపెయిన్ తమ చిన్నపిల్లల కళ్లలో కనిపించే విధంగా తల్లి చేతుల అద్భుత ఉపశమనాన్ని వేడుక చేసుకుంటుంది. ఈ మ్యాజిక్ తరచుగా పిల్లలకు శీఘ్ర ఉపశమనం కలిగిస్తుంది. హృద్యమైన కథనంతో రూపొందించిన ఈ ప్రచార చిత్రం గురించి పి జి ఇండియాలోని హెల్త్ కేర్, కేటగిరీ లీడర్, కేటగిరీ లీడర్, సీనియర్ మార్కెటింగ్ డైరెక్టర్ సాహిల్ సేథీ మాట్లాడారు, "విక్స్ వాపోరబ్ తమ చిన్న పిల్లలకు దగ్గు, బిగదీసుకుపోయిన ముక్కు మరియు తలనొప్పి నుంచి ఉపశమనం కలిగించడంలో తరతరాలుగా భారతీయ తల్లులకు సాధికారత అందించినందుకు గర్వంగా ఉందన్నారు. విక్స్ లాస్యతో కలిసి తల్లి చేతుల అద్భుత ఉపశమనాన్ని వేడుక చేసుకోవడంలో సన్‌టీవీ ప్రముఖ మహిళ, అలియా మానస, ప్రముఖ సినీ నటి, రచయిత్రి తల్లి టిస్కా చోప్రా, ప్రియమైన గాయని మరియు స్వరకర్త సితార కృష్ణకుమార్‌తో పాటు ప్రముఖ కన్నడ నటి శ్వేత శ్రీవాస్తవ్ ఉన్నారు.

జూనియర్ కాలేజ్ బిల్డింగ్ వెంటనే నిర్మించాలి

విశాలాంధ్ర - ఆనందపురం: భీమిలి నియోజకవర్గం పరిధి ఆనందపురం మండలం ఆనందపురం రెవెన్యూ ఎల్ వి పాలెం గ్రామపంచాయతీ సర్వేనెంబర్ 276లో జూనియర్ కాలేజ్ నిర్మాణం కోసం గత 2019 తెలుగుదేశం పార్టీ హయాంలో 5 ఎకరాల స్థలాన్ని కేటాయించి 3 కోట్ల 50 లక్షల రూపాయలు నిధులను కాలేజీ నిర్మాణం కోసం మంజూరు చేయగా ఎన్నికల రావడం వల్ల ఎన్నికల కోడ్ రావడం వల్ల నిర్మాణం పనులు ఆగిపోవడం జరిగింది తదుపరి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దాన్ని నిర్లక్ష్యం చేసి వచ్చి నాలుగు సంవత్సరాలు అయినా శంకుస్థాపన చేయకుండా కాలియా పని చేస్తూ జూనియర్ కాలేజీ తరగతులను హైస్కూల్లో నిర్వహిస్తూ హై స్కూల్ విద్యార్థులను ఇబ్బంది పెడుతూ జూనియర్ కాలేజీని నిర్వీర్యం చేసే చర్య అత్యంత దారుణం అని మీకు నిజంగా విద్య పట్ల గౌరవం విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి కలిగిన వారైతే వెంటనే కాలేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేసి త్వరితగతిన పూర్తి చేసి జూనియర్ కాలేజీని ప్రారంభించాలని తెలుగుదేశం పార్టీ తరఫున సెల్ఫీ ఛాలెంజ్ తో ప్రభుత్వానికి స్థానిక ఎమ్మెల్యే కి సూటిగా ప్రశ్నించిన భీమిలి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ మరియు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కోరాడ రాజబాబు వారితోపాటు విశాఖ పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మీసాల సత్యనారాయణ, ఆనందపురం ఎంపీటీసీ బంటుపల్లి అప్పలస్వామి, నియోజకవర్గం వాణిద్య విభాగ ఉపాధ్యక్షులు కొట్టియాడ రెడ్డి బాబు, జనరల్ సెక్రెటరీ గుండు గోవిందరావు(చిన్నబాబు), రాష్ట్ర చెట్టు బలిజ అధ్యక్షులు అంగటి రాము, ఆనందపురం గ్రామ పార్టీ అధ్యక్షులు మజ్జి రాజు, ఎల్వి పాలెం వైస్ ప్రెసిడెంట్ శ్రీను, కె ఆర్ బి యూత్ ప్రెసిడెంట్ గొర్ల సంతోష్ కుమార్, కొట్టియాడు సత్యమూర్తి, కొటియాడ లక్ష్మణమూర్తి తదితర మండల నాయకులు పాల్గొన్నారు.

షాక్ తగులుతున్న విద్యుత్ బిల్లులు

టీడీపీ జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీష్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జగన్ రెడ్డి ప్రభుత్వం ముచ్చటగా 10వ సారి 1766 కోట్లు విద్యుత్ వినియోగదారులపై మరోసారి భారం వేసారని విశాఖ, అనకాపల్లి జిల్లాకు విద్యుత్ కొనుగోలు ఖర్చు సర్దుబాటు పేరుతో ప్రతి నెల వినియోగదారుల నుండి 83 కోట్లు దోచుకుం టున్నారని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు, మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు వైసీపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ప్రజలపై విద్యుత్ ఛార్జీలు పెంచనని ఎన్నికలకు ముందు ఊరూరా తిరిగి ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై బాదుడే బాదుడు చేస్తున్నాడని, నమ్మకానికి, విశ్వసనీయతకు మారు పేరని చెప్పుకునే జగన్ రెడ్డి సాధారణ గృహం నుండి కోటీశ్వరుల వరకు వివిధ రూపాల్లో ఫిక్సిడ్ చార్జీలు, కస్టమర్ చార్జీలు, సర్ చార్జీలు, విద్యుత్ సుంకం, సర్దుబాటు చార్జీలు, ట్రూ ఆఫ్ చార్జీలు పేరట అధిక వసూళ్లకు పాల్పడుతున్నాడని ప్రజలకు అర్థం కాని రీతిలో దోపిడీకి తెర లేపుతున్నారని కరెంటు తీగలు పట్టుకోకుండానే బిల్లు చూస్తే షాక్ అయ్యే పరిస్థితి జగన్ రెడ్డి ప్రభుత్వంలోనే చూస్తున్నామని జగన్ రెడ్డి మోసాలను ప్రజలు గమనిస్తున్నారని నాగ జగదీష్ అన్నారు. సౌర విద్యుత్తు, విండ్ విద్యుత్తు మార్కెట్లో తక్కువ ధరకే దొరుకుతున్నప్పటికీ రెడ్డి సామాజిక వర్గంకు చెందిన విద్యుత్ ప్లాంట్ నుండి అధిక రేట్లకు అప్పన్నంగా కొనుగోలు చేసి వారిని మరింత ధనికులుగా చేస్తున్నారని పేదవాడిని దోచుకొని పెత్తందారులకు దోచుపెడుతున్నారని నాగ జగదీష్ మండిపడ్డారు. ఈ ఏడాది ఏప్రిల్ నుండి జూన్ వరకు మొదటి త్రైమాసికంలో ఎఫ్ పి పి సి ఏ చార్జి కింద 2021లో వినియోగించిన విద్యుత్తుకు యూనిట్‌పై 19 పైసలు చొప్పున అదనంగా వసూలు చేశారని నెలకు 12 కోట్ల మేర మూడు నెలలకు 36 కోట్లు ముక్కు పిండి వినియోగదారుల నుండి లాగేసారని, తాజాగా ఎఫ్ పి పి సి ఏ స్లాబ్ ను ఆగస్టు నుండి యూనిట్ కి 61.94 పైసలు పెంచి వసూల్ చేస్తున్నారని మొదట త్రైమాసికం తో పోలిస్తే ఈ భారం మూడింతలు పెంచేసారని జగన్ రెడ్డి చెప్పినట్టు పెంచుకుంటూ పోతామని చెప్పిన మాటలు యదార్థమని నాగ జగదీష్ అన్నారు. తక్షణం సర్దుబాటు విధానాన్ని రద్దు చేయాలని, ట్రూ ఆఫ్ సర్దుబాటు చార్జీలు నిలిపివేయాలని, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు స్మార్ట్ మీటర్లు పెట్టకూడదని, జగన్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం ఎస్సీ ఎస్టీ బీసీ వృత్తిదారులకు అన్ని రాయితీలు సంపూర్ణంగా అమలు చేయాలని, గృహ వినియోగదారులందరికీ వంద యూనిట్లు ఉచితంగా ఇవ్వాలని విద్యుత్ కంపెనీ సంస్థలకు బకాయిలు చెల్లించకుండా, వినియోగదారుల నుండివసూలు చేయడం దుర్మార్గమని నాగ జగదీష్ అన్నారు. మాడుగుల ఇన్చార్జ్ పివిసి కుమార్ చోడవరం ఇంచార్జ్ బత్తుల తాతయ్య బాబు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 5 సంవత్సరాలు కాలంలో విద్యుత్ చార్జీలు పెంచలేదని, నాణ్యమైన కరెంటును సరఫరా చేసామని, కోతలు లేని విద్యుత్ అందించామని వైసీపీ ప్రభుత్వంలో అన్ని ప్రజలకు బారాలేనని ముసలాయన విజయ సాయి రెడ్డి చెప్పినట్టు వచ్చే ఎన్నికల్లో 51% కాదు కదా 15% ఓట్లు వస్తే గగనమేనని నాగ జగదీష్, కుమారు, తాతయ్య బాబు వ్యాఖ్యానించారు.

దోచుకున్న వాళ్లంతా కోట్ల చుట్టూ తిరగాల్సిందే...

జనసేన అధినేత పవన్ కళ్యాణ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఉత్తరాంధ్రలో వైకాపా నేతలు దోపిడీ చేస్తున్నారని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ధ్వజమెత్తారు. వారాహి యాత్రలో భాగంగా మూడో రోజు ఆయన విశాఖలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా సిరిపురంలోని సీబీసీఎన్సీ భూములు, విశాఖ వైకాపా ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ నిర్మించే భవనాలను పవన్ పరిశీలించారు. అనంతరం పవన్ మాట్లాడుతూ ప్రశాంతమైన విశాఖలో గొడవలు పెడుతున్నారని మండిపడ్డారు. విశాఖలో వైకాపా నేతల భూ కబ్జాలు విపరీతంగా పెరిగాయన్నారు.చట్టాలను అతిక్రమించిన వారికి టీడీఆర్ బాండ్లు ఇచ్చారు. ఇక్కడి నుంచి పారిపోతామని చెప్పడం విశా ఎంపీకి తగదు. ఎక్కడికో వెళ్లి వ్యాపారం చేస్తానని ఎం చెప్పడం సిగ్గుచేటు. విశాఖ ప్రజలు ఓటేస్తేనే ఎంవీవీ ఎంపీ అయ్యారు. చర్చి ఆస్తులను అడ్డగోలుగా దోచేస్తున్నారు. సీఎంవోలోనే దొంగ సంతకాలు చేయడం దారుణం. ప్రశాంతమైన విశాఖ నగరాన్ని వైకాపా నేతలు చెడగొట్టేస్తున్నారు. హైదరాబాద్లో కూడా ఈ వర్గమంతా ఇలానే దోపిడీ చేస్తే.. అక్కడనుంచి తరిమేశారు. సింహాచలం భూములు, చర్చి స్థలాలు అడ్డగోలుగా దోచేస్తున్నారు. ఇదే తరహాలో దోపిడీ కొనసాగితే ఉత్తరాంధ్ర డంపింగ్ యార్డులా అవుతుంది. స్థలాలన్నీ బయటవారికి వెళ్లిపోతాయన్నారు. క్రిస్టియన్ ట్రస్ట్‌కు చెందిన ఈ భూములను వైసీపీ నేతలు అన్యాయంగా కొట్టేశారని, ఎంపీ సిగ్గు లేకుండా భార్యనీ, బిడ్డని, ఆడిటర్‌ను కూడా కూర్చోబెట్టి హింసిస్తే, మా పార్టీ వాళ్లు చేశారని అంటారు. సిగ్గుండాలి. ప్రజలకు అండగా ఉండాల్సిన ఎంపీ వ్యాపారాలు వద్దు హైదరాబాద్ వెళ్ళిపోతానని అనడం ఎంతవరకు కరెక్ట్ అని, ఎంపీ వెంటనే రాజీనామా చేసి ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. అడ్డగోలుగా ప్రైవేటు వ్యాపారాలు చేసుకునేందుకా మీకు ఎంపీ పదవులు ఇచ్చిందన్నారు. ఎంపీ ఏవైతే అక్రమాలు అన్యాయాలు దోపిడీ చేస్తున్నారో అన్నింటినీ బయటికి తీసుకొస్తాం అని, కొత్త ప్రభుత్వం వచ్చాక కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తుంది గుర్తుపెట్టుకో అన్నారు. జనసేన దీనిపై పోరాటం చేస్తుందన్నారు. ఆలయ భూములు, మసీదు భూములు, క్రిస్టియన్, భూములు కబ్జా చేస్తున్నారు.

విశాఖపట్నం చాలా ప్రశాంతమైన నగరం, ప్రశాంతతను వైసీపీ నేతలు చెడగొడుతున్నారు అని పవన్ కళ్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "హైదరాబాదును కూడా ఈ వర్గం ఇలాగే దోపిడీ చేస్తేనే అక్కడి నుంచి తన్ని తరిమేశారు. ఇదే కబ్జాలు జరిగితే ఉత్తరాంధ్ర డంపింగ్ యార్డులో మారిపోద్ది స్థలాలు వారి చేతిలోకి పోతాయన్నారు. ఉత్తరాంధ్ర కోసం ఆంధ్ర యూనివర్సిటీ విద్యార్థులు పోరాటం చేయాలన్నారు. 2047లో జరగాల్సిన దానికి ఇక్కడ ముందుగానే టీడీఆర్ చెల్లించారని. చర్చి ఆస్తులను సీఎంవోలో దొంగ సంతకాలు చేయడం దారుణ%శీ% అన్నారు. జగన్ సర్కార్ కుట్రలపై ప్రజలు తిరగబడాలని, దోపిడీ చేసిన ఆస్తికి వీధి శూలా అంటూ రోడ్డు మూసేశారన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు రాజ్యాంగాన్ని, ప్రజల ఆస్తులు కాపాడాల్సిన వాళ్లు బెదిరింపులకు భయపడొద్దని హితవు పలికారు. రౌడీలు, గుండాలు రాజ్యమేలుతున్నారని పవన్ కళ్యాణ్ మండిపడ్డారు. కోట్లు చేతులు మారాయన్న ఆరోపణల నేపథ్యంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ , నాదెండ్ల మనోహర్ సీబీసీఎన్‌సీ భూములను పరిశీలించారు. సీబీసీఎన్‌సీ భూముల వద్ద భారీగా పోలీసులు మోహరించారు. క్రిస్టియన్ ట్రస్ట్‌కు చెందిన ఈ వివాదాస్పద భూములను, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ తీసుకొని అభివృద్ధి చేస్తున్నారని ప్రభుత్వానికి చెందాల్సిన భూములను ఎంపీ అధికార బలంతో చేజిక్కించుకొని నిర్మాణాలు చేస్తున్నారని , దీని వెనక కోట్ల రూపాయలు చేతులు మారాయని అరోపణలు వస్తున్న నేపథ్యంలో ఆ భూములను పవన్ కళ్యాణ్ పరిశీలించారు.

పార్టీ ఏదైనా స్థానికులే ఎంపీ అవ్వాలి: ఆచార్య కె.యస్.చలం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి దాదాపు 20 లక్షల కోట్ల రూపాయల విలువైన భూములు దోపిడీకి గురయ్యాయని, బయటినుంచి వచ్చిన ప్రజా ప్రతినిధులే దోపిడీ చేశారని మాజీ వీసీ, యుపిఎస్సి మాజీ ఛైర్మన్ ఆరోపించారు. శనివారం పౌర గ్రంధాలయంలో జరిగిన "విశాఖపట్నం పార్లమెంట్ అభ్యర్థి ఎవరు" అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడుతూ విశాఖ నుంచే వేల ఎకరాల భూమి అన్యాక్రాంతం అయిందని అన్నారు. దక్షిణ భారతదేశంలో ఉత్తరాంధ్ర కీలక ప్రాంతం కావడంతో అందరి దృష్టి విశాఖ మీద పడిందన్నారు. 92 శాతం ఎస్సీ ఎస్టీ బీసీలే ఉత్తరాంధ్ర లో వున్నారన్నారు. స్థానికేతరుల దోపిడీ, అభివృద్ధికి నోచుకోకపోవడం వల్ల 1980 నుంచి 30 లక్షల మంది ప్రజలు హైదరాబాద్‌తోపాటు ఇతర ముఖ్య పట్టణాలకు వలస వెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. 1991 నుంచి స్థానికతరులే ఎంపీగా ఎన్నికవుతున్నారని తెలిపారు. ఏ పార్టీ వారైనా స్థానికులే ఎంపిగా అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ అల్లు గౌరీ శంకర్ మాట్లాడుతూ రెండు సామాజిక వర్గాలే రాజకీయంగా ప్రాతినిధ్యం వహిస్తున్నారని, స్థానికేతర్లు దోపిడీ చేసి అభివృద్ధి చెందుతున్నారే తప్ప ఇక్కడి వారి గురించి ఆలోచించడం లేదన్నారు. సీనియర్ పాత్రికేయులు వివి.రమణమూర్తి మాట్లాడుతూ పదవులు కోసం బడాబాబులు విశాఖ వస్తుంటే, పేద ప్రజలు పొట్టకూటి కోసం వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర మన చేజారి పోతుందేమో అనే ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి స్థానికంగా సరైన నాయకత్వం లేదన్నారు. ప్రజా ప్రతినిధులే పార్టీలో బానిసలుగా బ్రతుకు తున్నారు. దళారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. సమావేశంలో నన్నయ యూనివర్సిటీ మాజీ విసి ఆచార్య ముత్యాల నాయుడు, మాజీ జిల్లా జడ్జిలు పి.ముత్యాల నాయుడు, సబ్బవరపు సూర్యనారాయణ, ఫిలిం క్లబ్ అధ్యక్షులు నరవ ప్రకాశరావు, అరసం కార్యదర్శి అప్పలరాజు, సామాజిక ఉద్యమకారులు ఎస్‌వి కిరణ్ కుమార్, ప్రజా సంఘాల నాయకుడు డాక్టర్ పి శ్రీనివాస్, ఎఎంఎల్ కాలేజీ మాజీ అధ్యాపకులు నర్సింహారావు తదితరులు మాట్లాడారు.

రుచికరమైన భోజనం వడ్డించండి

విశాలాంధ్ర -సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరహా లక్ష్మీ నరసింహ స్వామి వారి నిత్య అన్న ప్రసాదమును భీమిలి ఎమ్మెల్యే ముత్తంసెట్టి నాణ్యతను పరిశీలించారు. భక్తులకు రుచికరమైన భోజనం వడ్డించాలని, అధికారులకు పలు సూచనలు చేశారు. శనివారం భోజన తయారీ ప్రసాదాల తయారీ ప్రాంగణాన్ని తనిఖీ చేశారు భక్తులను భోజన నాణ్యతపై అడిగి తెలుసుకున్నారు భక్తులంతా సంతృప్తి వ్యక్తం చేయడం పట్ల అవంతి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు అయితే మరింత నాణ్యత పెంచాలని సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు రుచికరమైన భోజనం వడ్డించాలని దేవుని సమక్షంలో అన్న ప్రసాదము చేసే భాగ్యం అదృష్టం అని అన్నారు. దేవస్థాన అధికారులకు పలు సూచనలు చేశారు అలాగే అన్న ప్రసాదం భవన అభివృద్ధి కోసం ప్రసాద్ స్కీం నిధులను వినియోగించాలని భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని ఇంజనీరింగ్ అధికారులను, శ్రీనివాస్ రాజును ఆదేశించారు.

దోమల నివారణకు ఫాగింగ్

విశాలాంధ్ర - చింతూరు: గోదావరి వరదల అనంతరం చింతూరు గ్రామపంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు సెక్రటరీ ప్రసాద్, వాలంటరీ నవీన్, కార్యాలయ సిబ్బంది ప్రసాద్ ఆధ్వర్యంలో ముమ్మరంగా చేపడుతున్నారు. ఎక్కడ చూసినా బాటిల్స్, ప్లాస్టిక్ గ్లాసులు, ఇతర వ్యర్థ పదార్థాలను తొలగించేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించుకొని ఎప్పటికప్పుడు ట్రాక్టర్లతో తీసుకెళ్లి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నారు. దోమలు ప్రబలకుండా నివారణకు గాను ఫాగింగ్ యంత్రాలు ద్వారా వీధుల వెంబడి పొగ వేస్తూ వున్నారు. ఉన్నతాధికారుల సూచనలను ఎప్పటికప్పుడు పాటిస్తున్నారు.

నవోదయ విద్యార్థినీకి గాయాలు

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్‌లో గల నవోదయ కాలేజ్ విద్యార్థిని మూడో అంతస్తు నుంచి కిందకు జారి పడి తీవ్రంగా గాయపడింది. నవోదయ కాలేజ్ లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న యశస్విని మూడో అంతస్తు నుంచి క్రిందకి జారి పడగా కాలేజీ యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారం అందించి, కేర్ ఆస్పత్రికి తరలిం చారు. అయితే సుజాతనగర్‌లో పర్యటించిన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ను చూసేందుకు విద్యార్థులు కాలేజీ మూడో అంతస్తుపైకి ఎక్కి ప్రమాదవశాత్తు జారిపడ్డారని స్థానికులు చెబుతున్నారు. కాలేజీ యాజమాన్యం నిర్లక్ష్యమే దీనికి కారణమని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వైసీపీని తరిమేద్దాం...

తెలుగుదేశం జెండా ఎగరేద్దాం

విశాలాంధ్ర - చింతపల్లి :- మన్య ప్రాంతం అభివృద్ధి చెందాలంటే రాబోవు (2024) సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ని గెలిపించాలని, వైసీపీ ప్రభుత్వాన్ని తరిమేయాలని తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. మండలంలోని కోటగున్నలు గ్రామంలో శనివారం ఆ పార్టీ చింతపల్లి మండల అధ్యక్షులు కిలో పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో మహా శక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె. మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వంలో మన్య ప్రాంతంలో ఎంతో అభివృద్ధి చేసుకున్నామని, ఈ వైసిపి నాలుగున్నర ఏళ్ళకాలంలో అభివృద్ధి అనేజడేలేదని ఈ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు లోతు గెడ్డ వంతెన నుండి మూల కొత్తూరు వరకు తారు రోడ్డు వేసుకోగలిగామని, నేడు ఆ రోడ్డు శిథిలావస్థకు చేరుకున్నా కనీసం పట్టించుకునే పాలకులు లేరని, ఇటువంటి ఎంపీ, ఎమ్మెల్యేలు మనకు అవసరమా అని ఆమె ఎద్దేవా చేశారు. ఈ తరుణంలో జరుగుతున్న ఉప ఎన్నిక లో మీ గ్రామంలో ఉన్న నీలవేణి అనే మహిళ వార్డు నెంబర్ గా నిలబడిందని ఆమెని మీ అమూల్యమైన ఓటు ముద్ర వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆమె కోరారు. మన అధినాయకుడు నారా చంద్రబాబు నాయుడు మినీ మేనిఫెస్టో ద్వారా మహిళలకు పెద్దపీట వేశారని తల్లికి వందనం పేరుతో మీ ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి 15వేల రూపాయలు ఆడబిడ్డ నిధి నుంచి 18 ఏళ్ళు నిండిన ప్రతి స్త్రీకి నెలకు 1500, దీపం పేరుతో ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, బీసీలకు రక్షణ చట్టం తెచ్చి వారికి అన్ని విధాల అండ, యువగళం పేరుతో 20 లక్షల మంది యువతకు ఉపాధి, నిరుద్యోగులకు యువగళం నిధి నుంచి నెలకు 3000 నిరుద్యోగ భృతి, ఏటా 20,000 ఆర్థిక సాయం ఇంటింటికి మంచి నీరు పథకం కింద ప్రతి ఇంటికి రక్షిత త్రాగునీటి కుళాయిలు కనెక్షన్ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో రాగానే మన ప్రభుత్వం ఇస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ బిసిసెల్ ఉపాధ్యక్షులు లక్కోజి నాగభూషణం, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణరావు, మాజీఎంపిటిసి బింగునాయుడు, జి మాడుగుల మండల అధ్యక్షులు వంతల కొండలరావు, షేక్ కాసిం వల్లి భీమన్న, చిరంజీవి నాయుడు,నితిన్, స్వర్ణ,నీలవేణి, వరహాల బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.